ప్రజాశక్తి
శనివారం 10 డిసెంబర్ 2022 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలి

- సిపిఎస్ రద్దు చేయకపోతే తీవ్ర పరిణామాలు
- పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి



పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-కొండపి

ఉపాధ్యాయులకు బదిలీలు అని ఊరిస్తూ అమలు జరపడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని, ఉపాధ్యాయులకు 30 వేల ప్రమోషన్లు ఇస్తున్నట్లు ప్రకటించి.. చివరికి మూడు వేలు కూడా ఇవ్వలేదని పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం జరుగుమల్లి, కొండపి మండలాల్లోని వివిధ ప్రాంతాల్లో గ్రాడ్యుయేట్లను కలిసి.. ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కొండపిలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన ప్రమోషన్లు అమలు జరపకుండా ఇప్పుడు సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేసేందుకు ప్రయత్నించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. సిపిఎస్ రద్దు చేస్తామని ప్రకటించిన హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, వచ్చే ఎన్నికల లోపల సిపిఎస్ రద్దు చేయకపోతే ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 60 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, 2.45 లక్షల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి ఈ రోజు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించటానికి ప్రయత్నం చేయడం గర్హనీయమన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ కేలండర్ ప్రకటిస్తామని.. నేడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. తాను ఎమ్మెల్సీగా గెలిస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆయా సంఘాలతో కలిసి పోరాటం చేస్తానని చెప్పారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వణికిస్తున్న తుపాన్



భట్టిప్రోలులో తడిసి ముద్దయిన వరి ఓదెలు

- మాండూస్ ప్రభావంతో భారీవర్షాలు
- పంటలపై రైతుల్లో తీవ్ర ఆందోళన
- వర్షాలు కొనసాగితే తీవ్ర నష్టం జరిగే అవకాశం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, బాపట్ల జిల్లా

మాండూస్ తుపాన్ ప్రభావంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయి. అన్ని రకాల పంటలకు ఈ వర్షాల వల్ల నష్టం తప్ప లాభం లేదు. కోస్తా మండలాల్లో వర్షం ఎక్కువగా ఉంది. పత్తి, వరి, మిర్చి, పొగాకు, మినుము, కంది తదితర పంటలకు వర్షం వల్ల బాగా నష్టం జరగనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులపాటు వర్షం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పంటలు ఎంత మేరకు చేతికి అందుతాయనేదీ చూడాలి. పూతపిందె రాలిపోయే ప్రమాదం ఉంది. వరి కూడా ధాన్యం తడిచి రంగుమారతాయి. నూర్పిడి దశలో ఉన్న ప్రాంతాల్లో నేలవాలినా నష్టమే.. మినుము కాయలు కుళ్లిపోతాయి. ఏదేమైనా ఈ కాలంలో వచ్చే వర్షాలు పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తాయి.

రైతులు అన్ని రకాల పంటలపై భారీగా పెట్టుబడులు పెట్టారు. ఈ సమయంలో ఆరుతడి పెడితేనే అన్ని పంటలకు ఉపయోగం. వర్షం కురిస్తే అన్ని విధాలా నష్టం. తుపాను ప్రభావంపై యంత్రాంగం అప్రమత్తంగానే ఉంది. కలెక్టర్లు ఎప్పటికప్పుడు తుఫాను హెచ్చరికలను గమనిస్తూ యంత్రాంగం అన్ని జాగ్రత్తలూ తీసుకునేలా ఆదేశాలు ఇస్తున్నారు. శింగరాయకొండ తహశీల్దార్ సిహెచ్.ఉషా ఆధ్వర్యంలో సముద్ర తీర ప్రాంతంలోని మత్స్యకారులను అప్రమత్తం చేశారు. పాకల ఊళ్లపాలెం గ్రామాల్లో ఉన్న మత్స్యకార ప్రాం తాలను రెవెన్యూ అధికారులు సందర్శించారు. అటు మెరైన్ పోలీసులు కూడా మత్స్యకారులను అప్రమత్తం చేశారు.

బాపట్ల జిల్లాలో తుపాన్ కారణంగా భారీవర్షం కురుస్తోంది. రేపల్లె సబ్ డివిజన్‌లో వేలాది ఎకరాల్లో వరి పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు తలెత్తాయి. జిల్లాలోని వేమూరు, అమర్తలూరు, భట్టిప్రోలు, రేపల్లె, చెరుకుపల్లి, చుండూరు తదితర ప్రాంతాల్లో వరి కోతలు జరుగుతున్నాయి. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం రేపల్లె సబ్ డివిజన్‌లో 90 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో ఇప్పటివరకు సుమారు 40 వేల ఎకరాల్లో వరికోతలు కోశారు. 30 వేల ఎకరాల్లో కోసిన వరి పంట పొలంలో పరిచి లేదా కుప్పలు వేసి ఉంది. ఈ రెండు రోజుల్లో రైతులు వరిపైరు కోసి నూర్పిళ్లు జరిపి అమ్మకాలు జరిపే చర్యలు చేపట్టారు. అది సాధ్యపడలేదు. కుప్పలు వేసే ప్రయత్నం చేశారు గానీ శుక్రవారం మధ్యాహ్నం నుంచి వర్షం ప్రారంభం కావడంతో ఆ ప్రయత్నం మానుకున్నారు. కోతకు సిద్ధంగా మరో 50 వేల ఎకరాల్లో వరి పంట సిద్ధంగా వుంది. ఈ తుఫాన్ కారణంగా బాగా గాలులు వేస్తే ఆ పంట అంతా నేలమట్టమయ్యే పరిస్థితి ఉంది. ఇలాగే వర్షం కొనసాగితే వేలాది ఎకరాల్లో వరి పైరు నీట మునగడం ఖాయమని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కారణంగా చీరాలలో శనివారం జరగాల్సిన మాజీ సిఎం చంద్రబాబునాయుడు పర్యటన రద్దయింది.

బాలినేని కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్

ఒంగోలు సబర్బన్: మాండుస్ తుఫాన్ కారణంగా అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. తన కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. తుఫాన్ కారణంగా ఒంగోలు నియోజకవర్గ ప్రజలకు ఏమైనా ఇబ్బంది ఉంటే ఆ నెంబర్‌లకు తెలియజేయాలని కోరారు. హెల్ప్‌లైన్ నెంబర్లు: 9949796033, 8555931920, 9000443065, 7661834294, 8555871450.



మెహరీన్, అనసూయ సందడి

8లో



బోల్తా పడ్డ కారు



దెబ్బతిన్న బైక్

ప్రాణాలు బలిగొన్న నిద్రమత్తు

3లో



చంద్రబాబు సభకు హాజరైన జనం

మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డేస్తా..

బాపట్ల సభలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు

8లో



మాట్లాడుతున్న నారా చంద్రబాబునాయుడు

ముగిసిన శిక్షణ

మార్కాపురం రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో 2023-2024 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ తరుగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా తరగతులను మార్కాపుంర సబ్ కలెక్టర్ సేతుమాధవన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తరుగతులలో చెప్పిన అంశాల గురించి సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ సేతుమాధన్ మాట్లాడుతూ నవరత్నాలు, ఉపాధి హామీ పథకం, నాడు-నేడు, జలజీవన్ మిషన్, విద్య వైద్య రంగాలకు సంబంధించిన పథకాల ద్వారా సుస్థిర అభివద్ధి సాధించే దిశగా గ్రామ అభివద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం కె.కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి ఓబుల్ రెడ్డి గ్రామపంచాయతీ ప్రణాళిక గురించి లఘు చిత్రాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తోట చందన తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలిలోని విశ్వబ్రాహ్మణ ఆరామక్షేత్రం శ్మశాన వాటికను అక్రమంగా నిర్మించిన వాణిజ్య సముదాయాలను భారీ బందోబస్తు మధ్య అధికారులు శుక్రవారం కూల్చి వేశారు. తహశీల్దారు డి. భాగ్యలక్ష్మి, నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసప్, సిఐ సుధాకర్ రావు పర్యవేక్షణలో ఈ అక్రమాలు తొలగించారు. ఈ సందర్భంగా తహశీల్దారు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 2010లో పొదిలి శివాలయం ఎదురుగా గ్రామ సర్వే నెంబర్: 853/2లోని శ్మశాన వాటికలో కొందరు అక్రమంగా వాణిజ్య సముదాయ భవనాలు ఏర్పాటు చేసినట్లు పొదిలికి చెందిన మందగిరి వెంకటేష్ యాదవ్ ఆంధ్రప్రదేశ్ లోక యుక్తలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. లోకాయుక్త ఆక్రమ కట్టడాలు తొలగించాలని ఆదేశించినట్లు తెలిపారు. మండల రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. దీంతో ఆక్రమణ దారులు హైకోర్టు ను ఆశ్రయించి స్టే తెచ్చుకున్నట్లు తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కోర్టు కూడా అక్రమ కట్టడాలు తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. దీంతోపై కూడా వారు మళ్లీ హైకోర్టును ఆశ్రయించారన్నారు. అనంతరం హైకోర్టు సిసిఎల్ఎకు కేసును బదిలీ చేసినట్లు తెలిపారు. సిసిఎల్ఎ సుదీర్ఘ విచారణ అనంతరం గత నెల 10న తుది విచారణ జరిపి ఉత్తర్వులను ఈనెల 7న పంపినట్లు తెలిపారు.ఆ ఉత్తర్వులు మేరకు అక్రమ నిర్మాణాలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తలెఇపారు. మున్సిపల్ కమిషనర్ వారి కోరిన మీదట పోలీస్ బందోబస్తు మధ్య పంచనామా నిర్వహించగా మున్సిపల్ సిబ్బంది అక్రమ నిర్మాణాలు తొలగించినట్లు తెలిపారు.


ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

మాజీ ఎమ్మెల్యే కందులను అడ్డుకున్న పోలీసులు

అక్రమ నిర్మాణాలను తొలగింపును మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అడ్డుకొనేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కందుల మాట్లాడుతూ పొదిలి పట్టణంలో వైసిపి నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించారని వాటిని తొలగించిన తర్వాత వీటిని తొలగించాలని కోరుతూ నిరసన తెలిపారు. సిఐ సుధాకర్ ఆధ్వర్యంలో పొదిలి, మర్రిపూడి ఎస్ఐలు శ్రీహరి, అంకమ్మరావు పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు.

గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు

పజాశక్తి మద్దిపాడు

మద్దిపాడు పిహెచ్‌సిలో ప్రధాన మంత్రి సురక్షిత మాతత్ర అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ డి. మానస ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం గర్భిణులతో ముఖాముఖి నిర్వహిం చారు. గర్భం దాల్చిన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ లలితమ్మ, ఎంపిహెచ్ఒలు నాగేశ్వరావు, బాలకోటయ్య, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మానస

టంగుటూరు : గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవం చేయించుకోవాలని వైద్యాధికారులు డాక్టర్ ప్రసాద్ బాబు, డాక్టర్ రవి, డాక్టర్ అశోక్ బాలాజీ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతత్వ వందన యోజన (పిఎంఎంవివై) కార్యక్రమంలో గర్భిణులకు శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ గర్భం దాల్చిన నాటి నుంచి అన్ని రకాల పరీక్షలు, పోషకాహారాన్ని అందించి సుఖ ప్రసవం అయ్యేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైద్యపరీక్షలకు చేయింకున్న 18 మంది గర్భిణులకు ఆసుపత్రి సిహెచ్ఒ డిఎన్.వెంకటేశులు భోజనాన్ని పంపిణీ చేశారు. ప్రతి నెలా 9వ తేదీ వైద్య పరీక్షలకు వచ్చే గర్భిణులందరికీ భోజనాన్ని అందజేస్తాననివెంకటేశులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రైడే -డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించిన డిపిఒ

ప్రజాశక్తి -శింగరాయకొండ

మండల పరిధిలోని పాతశింగరాయకొండ గ్రామంలో శుక్రవారం ఫ్రైడే -డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిపిఒ నారాయణరెడ్డి పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సార్లు డ్రైడే పాటించాలన్నారు. ఎక్కువ రోజులు నీటి నిల్వలు చూసుకొనేలా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జుననగర్ గిరిజన కాలనీలో నీటితొట్టిలో నిల్వ ఉన్న నీటి తొలగించారు, అనంతరం పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అభివద్ధి, సంక్షేమ, పారిశుధ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.


నీటి తొట్టిని శుభ్రం చేస్తున్న సిబ్బంది

ముందస్తు చర్యలు చేపట్టాలి.

మాండూస్ తుఫాను నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి డివిజనల్ పంచాయతీ మండల. పంచాయతీ కార్యదర్శులకు డిపిఒ దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా హెడ్ క్వార్టర్‌లో అందుబాటులో ఉండాలన్నారు. లోతట్టు తుఫాను ప్రభావిత ప్రాంతాలను గుర్తించి అక్కడి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సింగరాజు మారుతీబాబు

ప్రాణాలు బలిగొన్న నిద్రమత్తు

- బైక్‌ను ఢీకొన్న కారు
- ముగ్గురు మృతి

ప్రజాశక్తి-దొనకొండ

కారు డ్రైవింగ్ చేసే వ్యక్తి నిద్రమత్తు కారణంగా మూడు ప్రాణాలు బలయ్యాయి. బైక్‌ను కారు ఢీకొట్టడంతో బైకిస్టుతో పాటు కారులోని ఇద్దరు మృత్యువాతపడ్డారు. ఈ ఘటన దొనకొండ మండలంలోని దొనకొండ-రుద్రసముద్రం రహదారిలో శుక్రవారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ముండ్లమూరు మండలంలోని పులిపాడు గ్రామానికి చెందిన రామలక్ష్మమ్మ(90) మరికొందరితో కలిసి పెద్దారవీడు మండలం శివాపురం గ్రామంలో బంధువుల ఇంటి గృహప్రవేశానికి వెళ్లింది. గురువారం రాత్రి దేవరాజుగట్టు వద్ద కాశినాయన ఆరాధన సందర్భంగా కోలాటం కార్యక్రమం చూసుకుని శుక్రవారం ఉదయం కారులో రామలక్షమ్మ తన బంధువులైన అన్నెం నాగేశ్వరరెడ్డి, మహేంద్రకుమారి, నవ్య, భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారులు సంతోష్‌రెడ్డి(11), పవన్‌కుమార్‌రెడ్డితో పులిపాడుకు బయల్దేరారు. దర్శి మండలంలోని చందలూరు గ్రామానికి





మృతి చెందిన నరేంద్రకుమార్, సంతోష్‌రెడ్డి

చెందిన చెక్కినేని నరేంద్రకుమార్(25) మార్కాపురం మోడల్ స్కూల్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈయన ఇదే దారిలో మార్కాపురానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న కారు డ్రైవర్ నాగేశ్వరరెడ్డి నిద్ర మత్తులో వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. కారు కూడా బోల్తా పడింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న నరేంద్రకుమార్, కారులో ఉన్న సంతోష్‌రెడ్డి(11) అక్కడికక్కడే మృతిచెందారు. రామలక్ష్మమ్మకు తీవ్రగాయాలు కావటంతో 108లో మార్కాపురం తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందింది. నాగేశ్వరరెడ్డి, మహేంద్రకుమారికి తీవ్రగాయాలు కావటంతో ఒంగోలులోని కిమ్స్‌కు తరలించారు. 10 నెలల వయస్సు గల నవ్య క్షేమంగా ఉంది. కనిగిరి సిఐ పాపారావు, కురిచేడు ఎస్ఐ దేవకుమార్, దొనకొండ ఏఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుమారుడు సంతోష్‌రెడ్డి కళ్లముందే చనిపోవటంతో భాస్కరరెడ్డి కన్నీరు మున్నీరయ్యారు.

రమేష్‌బాబు ఆస్తిపై సిఐడి విచారణ

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

అక్షయగోల్డ్ డైరెక్టర్ రమేష్‌బాబు సంబంధించిన అస్తులపై ఎపిసిఐడి శుక్రవారం కల్యాణి బార్ అండ్ రెస్టారెంట్‌పై దాడులు నిర్వహించారు. అక్షయగోల్డ్ కంపెనీ గతంలో డిపాజిట్లు సేకరించి మోసానికి పాల్పడిన సంఘటనపై దర్యాప్తు జరుగుతోంది. అందులో భాగంగా అక్షయ గోల్డ్ కంపెనీలో 8వ డైరెక్టర్‌గా రమేష్‌బాబు ఉన్నాడు. అయితే అతనికి సంబంధించిన ఆస్తులను అప్పటిలో ప్రభుత్వం అటాచ్‌మెంట్ చేసింది. అతనికి సంబంధించిన కర్నూలు రోడ్డులోని ఆస్తిని వీరయ్య అక్రమంగా స్వాధీనం చేసుకుని అందులో రెస్టారెంట్ బార్, లాడ్జి నడుపుకుంటున్నట్లు సిఐడి అధికారులు తేల్చారు. ఆ ఆస్తి నుంచి రావలసిన అద్దెలు, వగైరాలు డిపాజిట్‌దార్లకు చెందవలసిన ఉన్నది. ఈ ఆస్తి అనధికారికంగా స్వాధీనంలో ఉంచుకుని డిపాజిటర్లకు నష్ట కలిగిస్తున్నారు. అంతేకాకుండా రమేష్‌బాబుకు చెందిన ఆస్తిని వీరయ్య అనధికారికంగా అనుభవిస్తూ చట్టానికి విరుద్ధంగా భవనాలు నిర్మించి వ్యాపారం చేస్తూ డిపాజిటర్లకు నష్టం కలిగిస్తున్నారని సిఐడి అధికారులు తెలిపారు. ఎపిసిఐడి అధికారుల దర్యాప్తులో భాగంగా డిపాజిటర్లకు రావలసిన సొమ్ము రాబట్టేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఈ అంశంపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎపిసిఐడి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

సాంకేతిక కారణాల వల్లే పొరపాట్లు

గ్రాడ్యుయేట్ ఓట్ల వ్యవహారంపై తహశీల్దారు సిహెచ్ ఉష

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-శింగరాయకొండ

సాంకేతిక కారణాల వల్ల గ్రాడ్యుయేట్ ఓట్ల నమోదులో పొరపాట్లు జరిగి ఉండవచ్చుని తహశీల్దారు ఉష తెలిపారు. ప్రజాశక్తి దిన పత్రికలో శుక్రవారం పచురితమైన ఐదో తరగతికి గ్రాడ్యుయేట్ ఓటు అనే కథనానికి జిల్లా అధికారులు, తహశీల్దారు ఉష స్పందించారు. ఐదో తరగతి, పదో తరగతి వారికి వచ్చిన ఓటు అప్లికేషన్లను పరిశీలించారు. ఇద్దరూ గ్రాడ్యుయేట్లు అని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఓటర్ లిస్టులో ఇది ఎలా వచ్చిందనే విషయమై పరిశీలిస్తు న్నామన్నారు. ఈ అప్లికేషన్‌లపై బిఎల్ఒల ద్వారా విచారణ జరిపించినట్లు తెలిపారు. వారి సర్టిఫికెట్ల మీద గజిటెడ్ సంతకాలు కూడా ఉన్నాయన్నారు. ఓటర్ లిస్టు తయారీ ఎన్నికల కమిషనర్ కార్యాలయం నుంచి వస్తుందని తెలిపారు. నవీన్, అశోక్ ఆధ్వర్యంలో తహశీల్దారు అప్లికేషన్ల పరిశీలించారు. అధికారుల నుంచి అనుమతి తీసుకొని గ్రాడ్యుయేట్ ఓటర్లకు సంబంధించి తప్పులను సరి చేస్తామన్నారు.




అప్లికేషన్‌ను పరిశీలిస్తున్న తహశీల్దారు

తుపాను దెబ్బకు ఎగిసిపడుతున్న అలలు

సురక్షిత ప్రాంతాలకు వలలు, బోట్లు ● అప్రమత్తం చేసిన అధికారులు

ప్రజాశక్తి -శింగరాయకొండ

మాండూస్ తుఫాన్ ప్రభావంతో శుక్రవారం సముద్రంలో అలలు ఎగిసిపడు తున్నాయి. తుఫాన్ నెల్లూరు వద్ద తీరం దాటుతుందని అధికారుల హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. తహశీల్దారు ఉషా ఆధ్వర్యంలో తీర ప్రాంతాల్లోని మత్స్యకారులను అప్రమత్తం చేశారు. పాకల, ఊళ్లపాలెం గ్రామాల్లోని మత్స్యకార ప్రాంతాలను రెవెన్యూ అధికారులు సందర్శించారు. మెరైన్ పోలీసులు కూడా మత్స్యకారులను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు కూడా తుఫాను ప్రభావం ఉండొచ్చనే ఆలోచనతో వలలు, బోట్లను ఒడ్డుకు చేర్చుకున్నారు.



ఎగసిపడుతున్న సముద్రం అలలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

శాస్త్రీయ ఆలోచనలను పెంచుకోవాలి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు ● జెవివి జిల్లా సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చీరాల: విద్యార్థులు అందరూ ప్రశ్నించేతత్వాన్ని కలిగి ఉండి శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ్‌రావు అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన గౌతమి జూనియర్ కళాశాలలో జరగనున్న జిల్లా స్థాయి జెవివి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక శ్రీ మేధావి జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 50 బృందాలు మండల స్థాయిలో జరిగిన పోటీలలో విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలలో హాజరుకానున్నారని అన్నారు. అనంతరం జెవివి జిల్లా స్థాయి చెకుముకి సంబరాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్ర రామారావు బాపట్ల జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు వై భాస్కరరావు జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సుభాని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మనోజ్ కుమార్, యుటిఎఫ్ నాయకులు ఎస్‌కె జానీ బాషా వీరాంజనేయులు, శ్రీ మేధావి ప్రిన్సిపాల్ దుర్గాకుమార్ పలువురు పాల్గొన్నారు.



స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా ప్రచార ఉద్యమం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా నడుం బిగించాలి

ప్రజాశక్తి-అద్దంకి: నేటి ఆధునిక సమాజంలో స్త్రీలు, బాలికలపై జరుగుతున్న హింస, అత్యాచారాల నిర్మూలనకు కఠినమైన చట్టాలను ప్రభుత్వం రూపొందించినప్పటికీ వాటిని సక్రమంగా వినియోగించు కోవడంలో ప్రతి మహిళ వాటిపై అవగాహన కలిగి ఉండాలని కొరిశపాడు సిడిపిఓ కె కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన అద్దంకి పట్టణంలోని గురకయపాలెంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా ప్రచార ఉద్యమ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 1999 సంవత్సరం నుంచి డిసెంబర్ నెలలో ఐక్యరాజ్యసమితి స్త్రీలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా జరుగుతున్న దాడులకు ఒక చట్టాన్ని రూపొందించి దానికి వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మోదేపల్లి వైద్యాధికారి ఎన్ జయచంద్ర మాట్లాడుతూ తరతరాలుగా మహిళలపై హింస, సాధారణ గృహ హింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలు రూపుమాపటానికి ప్రతి మహిళ చట్టాలపై అవగాహన చేసుకుని వాటి నిర్మూలకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు. తదుపరి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.



అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండలో అక్రమంగా ఇతర రాష్ట్రాల మద్యం అమ్ముతూ పట్టుబడిన ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేశారు. నిందితులు టీ విజయలక్ష్మి, గురజాల డేనియల్ కందుకూరుకు చెందినవారు. తెలంగాణ, గోవా రాష్ట్రాల మద్యం ఫుల్ బాటిల్లు 10 అమ్ముతూ పట్టుబడారు. ఈ దాడిలో ఎస్సీబీ ఎస్ఐ సిహెచ్ దయాకర్, వారి సిబ్బంది, డిటిఎఫ్ ఎస్ఐ శ్రీనివాసులు, వారి సిబ్బంది పాల్గొన్నారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఖాళీ బాటిల్‌ను చూపారు

సెబ్ పోలీసులు శింగరాయకొండలో అక్రమంగా ఇతర రాష్ట్రాల మద్యం అమ్ముతున్నారని ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. అయితే సెబ్ పోలీసులు అరెస్టు సమయంలో చూపిన మద్యం బాటిళ్లలో ఖాళీ బాటిల్స్‌ను కూడా చూపారు. మొత్తం పది బాటిళ్ల చూపగా 8 బాటిళ్ల ఫుల్లుగా కనిపిస్తున్నా ఒక బాటిల్లో కొంచెం మద్యం ఉంది. మరొక బాటిల్ మాత్రం ఖాళీగానే కనిపిస్తోంది. సెబ్ పోలీసులు ఖాళీ బాటిల్ కూడా చెబుతారా అంటూ చర్చగా మారింది.

పావులూరులో నేత్రదానం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు మండలం పావులూరులో నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన పులఖండం శేషమ్మ(65) మృతి చెందగా కుటుంబ సభ్యులు ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీకి సమాచారం అందించారు. గుంటూరు శంకర కంటి వైద్యులు పావులూరు వచ్చి కార్నియాలు సేకరించారు. నేత్రదానం చేసినందుకు రోటరీ ప్రతినిధులు సోమేపల్లి రామ్మోహన్‌రావు, జెట్టి వెంకటేశ్వర్లు, శేషమ్మ భర్త పి హనుమంతారెడ్డిని మాజీ సర్పంచ్ పి బద్రిరెడ్డి, రోటరీక్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ అధ్యక్ష కార్యదర్శులు భవనం అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావు అభినందించారు.



శేషమ్మ (ఫైల్)

రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-పంగులూరు

క్రిస్టమస్, నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని కొండమంజులూరు గ్రామంలో కొండమంజులూరు(7వ) కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ బాధ్యులు, శుక్రవారం ప్రకటనలో ఒక తెలిపారు. ఈ పోటీలు డిసెంబర్ 23,24,25, తేదీల్లో జరుగుతాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థాయిలో జరిగే ఈ పోటీల్లో, గెలుపొందిన వారికి, మొదటి బహుమతిగా రూ.50,116/- మరియు షీల్డ్, రెండో బహుమతిగా రూ.30,116/- మరియు షీల్డ్, మూడో బహుమతిగా రూ.20,116/-మరియు షీల్డ్, నాలుగో బహుమతిగా రూ.10,116/- మరియు షీల్డ్ ఇస్తారని పేర్కొన్నారు. ఈ పోటీలు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయని, మ్యాచ్‌లన్నీ షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని, దూర ప్రాంతాల నుండి వచ్చే క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తామని, సాయంత్రం సమయంలో ఫ్లడ్ లైట్ల వెలుతురులో పోటీలు నిర్వహిస్తామని, రాష్ట్రస్థాయి నియమ నిబంధనల ప్రకారమే పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన టీంలు, రూ.700 ఎంట్రీ ఫీజుతో ఈ నెల 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు, కమిటీ వారికి తెలియజేయాలని కోరారు. వివరాలకు ఎం పురుషోత్తం, కొండ మంజులూరు గ్రామం, పంగులూరు మండలం, బాపట్ల జిల్లా, ఆంధ్ర ప్రదేశ్, సెల్ నెంబర్ 8142683054లో సంప్రదించాలని కోరారు.

చీరాల మున్సిపాలిటీకి ఐటిసి మొండిచేయి

గడియార స్తంభం పునరుద్ధరణ లేదు ● ఐటిసిని నమ్ముకుంటే బోర్డు మాత్రమే మిగిలింది

ప్రజాశక్తి-చీరాల, బాపట్ల జిల్లా

చీరాల చరిత్రలో మమేకమై దశాబ్దాల కాలంగా పేరెన్నికగన్న గడియార స్తంభం గత పాలకుల అనాలోచిత చర్యల కారణంగా కాలగర్భంలో కలిసిపోయింది. ప్రజల విన్నపం మేరకు చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి ఆంధ్రరత్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌పైన గడియార స్తంభం ఏర్పాటుకు చొరవ తీసుకున్నారు. ఇందుకోసం మున్సిపల్ నిధులు కూడా కేటాయించి టెంటర్లు కూడా పిలిచారు. ఈ సమయంలోనే రంగప్రవేశం చేసిన ఐటిసి కంపెనీ అధికారులు చీరాలలో ఐటిసి, ఐఎల్‌టిడి కంపెనీని ఏర్పాటు చేసి వందేళ్ల అవుతున్న నేపథ్యంలో ఇందుకు గుర్తుగా తాము గడియార స్తంభం సెంటర్‌లో తమ కంపెనీ నిధులతో దాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కరణం బలరాంతో కలిసి ఐటిసి అధికారులు ప్రస్తుతం పట్టణ సెంటర్‌లో రాజశేఖరరెడ్డి విగ్రహం ఉన్న ప్రాంతంలో అధునాతన గడియార స్తంభం ఏర్పాటుకు పరిశీలన


చీరాల సెంటర్‌లో ఏర్పాటు చేసిన లైటింగ్ బోర్డు

చేశారు. రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాలుగువైపులా వలయాకారంలో స్తంభాలు నిర్మించి విగ్రహం పైన శ్లాబ్ వేసి అక్కడ నుంచి ఎత్తుగా స్తంభం నిర్మించి గడియార స్తంభం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, ఐటిసి అధికారులు అంచనాలు రూపొందించారు. ఐటిసి వారిచ్చిన హామీ మేరకు వంద సంవత్సరాల ఐటిసి వేడుకల సందర్భంగా ఈ నెల 8వ తేదీన చీరాల సెంటర్లో గడియార స్తంభాన్ని ప్రారంభించాల్సి ఉంది. కానీ ఆ తర్వాత ఏమైందో తెలియదు గానీ ఐటీసీ వారు చీరాల సెంటర్లో గడియారం ఏర్పాటు గురించి మౌనం దాల్చారు. వందేళ్ల వేడుకల సందర్భంగా కనీసం గడియార స్తంభం ఏర్పాటుకు శంకుస్థాపన చేయాలని పురపాలకులు కోరారు. ఈ విషయం గురించి తమ హెడ్ ఆఫీస్‌కు నివేదిక పంపామని, ఇక్కడి నుంచి ఎలాంటి సమాచారం లేదని స్థానిక ఐటిసి అధికారులు చెప్పి ఇచ్చిన హామీని తుంగలో తొక్కారు. ఈ నేపథ్యంలో గత శుక్రవారం స్థానికంగా జరుగుతున్న ఐటిసి వేడుకలకు ఎమ్మెల్యే కరణం బలరాంను పిలిచిప్పటికీ ఆయన విముఖత చూపి వేడుకలకు గైర్హాజరయ్యారు. ఇలా వందేళ్ల చీరాల ఐటిసి కంపెనీ చీరాల పురపాలక సంఘానికి జలక్ ఇచ్చినట్లయింది. చీరాల ఐటీసీ కంపెనీని నమ్ముకున్న పురపాలకులు చివరికి చేసేదేమీ లేక ఆ స్థలంలో గడియారం స్తంభం బదులు రంగురంగుల దీపాలతో బోర్డు ఏర్పాటు చేసి ఇక్కడ గతంలో గడియార స్తంభం ఉండేదన్న విషయాన్ని ప్రజలకు గుర్తు చేస్తున్నట్లు ఉండిపోయారు.

బాపట్ల కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

తుఫాను నేపథ్యంలో బాపట్ల కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చెప్పారు. అత్యవసర సేవల కోసం ప్రజలు కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 8712655881లో సంప్రదించాలని కోరారు. తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.


రెండో విడత భూ సర్వే కార్యక్రమంపై వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లకు సూచనలు అందజేస్తున్న రేపల్లె ఆర్డీవో పార్థసారథి

రెండో విడత భూ సర్వేకు సన్నద్ధం కండి: ఆర్‌డిఒ

ప్రజాశక్తి-చెరుకుపల్లి

రెండో విడత భూ సర్వే కార్యక్రమాన్ని త్వరలో చెరుకుపల్లి మండలంలో ప్రారంభిస్తున్నట్లు రేపల్లె ఆర్డిఓ జే పార్థసారథి తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లకు భూ సర్వే గురించి అవగాహన కల్పించారు. త్వరలో ప్రారంభమయ్యే భూ సర్వే కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించి విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో తహశీల్దారు టీ ప్రశాంతి, డిప్యూటీ తహశీల్దార్ టి నిరంజన్ బాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వికలాంగ విద్యార్థులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యార్థులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-పంగులూరు: పంగులూరులోని భవిత విద్యా వనరుల కేంద్రంలోని వికలాంగులైన విద్యార్థులకు శుక్రవారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. పంగులూరు గ్రామానికి చెందిన చిలుకూరి శ్రీధర్ తల్లి సీతారావమ్మ మరణించి సంవత్సరం అయిన సందర్భంగా శ్రీధర్ ఆధ్వర్యంలో వికలాంగ విద్యార్థులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాయిని వెంకట సుబ్బారావు, పంగులూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రమ్మ, ఎంపీటీసీ నూతలపాటి రాములు, గుడిపూడి రామారావు, వార్డు మెంబర్ ఖాసీం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా


చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

పోలీస్ కుటుంబాలకు అండగా వుంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎళ్లవేళలా సిద్ధంగా ఉంటామని, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కె వెంకటరమణ, కానిస్టేబుల్ కే వెంకటేశ్వర్లు సతీమణులకు ఫ్లాగ్ ఫండ్, విడో ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రతి బాధిత పోలీస్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ఉన్న సమస్యలను గురించి, వారి పిల్లల చదువుల గురించి అడిగి తెలుసు కున్నారు. పోలీసు శాఖలో అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. అటువంటి వారి కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని పేర్కొన్నారు. మనం అందరం ఒక పోలీసు కుటుంబమని, ఏదైనా సమస్య వచ్చినా, ఏ సహాయం కావాలన్నా తక్షణం స్పందించి సహాయం అందించడానికి ఎల్లవేళలా పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ బి సెక్షన్ సూపరింటెం డెంట్ కె రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరించిన బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నేరాలు, మోసాల నివారణపై పుస్తకం: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలు, మోసాల పట్ల ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించడానికి జిల్లా ఐటి కోర్ సిబ్బంది ద్వారా ప్రత్యేకంగా రూపొందించి తయారు చేసిన పుస్తకాన్ని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ సమావేశ హాల్‌లో గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసులు, ఇతర పోలీస్ అధికారుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నూతన బాపట్ల జిల్లా ఏర్పడినప్పటి నుంచి జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని, వీటిని అధిగమించేందుకు ప్రజలకు సైబర్ నేరాలు, మోసాల గురించి అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావడం కోసం, రోడ్డు భద్రత అవగాహన గురించి, దిశ మొబైల్ యాప్ గురించి, మొబైల్ యాప్‌ల ద్వారా జరిగే మోసాల గురించి, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ గురించి, బాల్య వివాహ చట్టం గురించి, గృహ హింస, పోక్సో చట్టాల గురించి, మొబైల్ కేవైసీ మోసాల గురించి, ప్రైజ్ మనీ వచ్చిందంటూ చేసే సైబర్ నేరాలు గురించి, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం యొక్క ఉపయోగాల గురించి, సైబర్ నేరాల గురించి వాటి నివారణ చర్యలు గురించి ఈ పుస్తకంలో పొందుపరచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డిసిఆర్బి డిఎస్పి జి. లక్ష్మయ్య, జిల్లా ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ మురళీ కృష్ణ, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంతో..

పేద విద్యార్థులకు తీవ్ర నష్టం

- ఎస్ఎఫ్ఐ సెమినార్‌లో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-చీరాల: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం దేశంలోని పేద విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగించేలా ఉందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఈ విద్యా విధానం పూర్తిగా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి భారీ పెట్టుబడులతో కార్పొరేట్ విద్యా విధానాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ఉందని నాయన పేర్కొన్నారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ మేధావి జూనియర్ కళాశాలలో బాపట్ల జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు మనోజ్ కుమార్ అధ్యక్షత 'విద్యారంగం నేటి పరిస్థితులు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఇప్పటికే జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాఠశాల స్థాయిలో నూతన విద్యా విధానం అమలు చేస్తూ ప్రాథమిక పాఠశాలలను వందల సంఖ్యలో మూసివేసిందని అన్నారు. ఉన్నత విద్యలోనూ మార్పులు చేస్తూ డిగ్రీ నాలుగేళ్ల విధానం బీటెక్ ఐదేళ్ల విధానాన్ని ప్రారంభించారని, ఇది కేవలం పెట్టుబడిదారుల కంపెనీలలో బానిసలుగా మార్చే మార్పు తప్ప విద్యార్థుల్లో సామాజిక చైతన్యం, నైతిక అభివృద్ధి, ఉపాధి కల్పనకు


ఎస్ఎఫ్ఐ సెమినార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ఉపకరించేది కాదని అన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ఐక్యమై ఈ విద్యా విధానాన్ని తిప్పి కొట్టాలని, చీరాల ప్రాంతంలో అన్ని విద్యా సంస్థలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ చీరాల ప్రాంతంలో అనేకమంది మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని, అటువంటి వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, సామాజిక చైతన్యంతో చదువుకోవాలని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా ఎస్ఎఫ్ఐ విద్యార్థులకు అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చీరాల నాయకులు కుమార్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్ర రామారావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జానీ బాషా, కళాశాల డైరెక్టర్ దుర్గాకుమార్, విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులకు 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నిరుపేదలకు 90 రోజుల్లో ఇంటి పట్టాల పంపిణీ చేయడానికి రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టరు విజయకృష్ణన్ తెలిపారు. రెవెన్యూ అంశాలపై సంబంధిత శాఖ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్యతను గుర్తించి నిరుపేదలకు నివాసం కల్పించాలని కలెక్టరు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 1995 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంపై కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. భూమి ఉన్నప్పటికీ పేదలకు ఇంటి స్థలం ఎందుకు కేటాయించడం లేదని అధికారులను నిలదీశారు. బాపట్లలో చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని అన్నారు. భూహక్కు పత్రాలు జారీలో జాప్యాన్ని కలెక్టరు ప్రశ్నించారు. వివిధ అంశాలలో పురోగతి లేకపోవడంపై అధికారులు పనిచేయకుండా తమాషాలు చేస్తున్నారా అని మందలించారు. రూ.1.96 కోట్లు నిధులు సర్వే కోసం విడుదలైనప్పటికీ వినియోగించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో భూహక్కు పత్రాల పంపిణీ


రెవెన్యూ అంశాలపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష

ప్రక్రియను జయప్రదం చేయాలన్నారు. అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే సహించేది లేదని అన్నారు. భూమి బదలాయింపులపై 1643 అర్జీలు పెండింగ్‌లో ఉండడం సరికాదన్నారు. ఓటర్ల జాబితా సవరణ కోసం ప్రజల నుంచి 29 వేల 82 దరఖాస్తులు రాగా నేటికి 17 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంపై ఆరా తీశారు. పెండింగ్ దరఖాస్తులను తక్షణమే విచారించాలని అన్నారు. జిల్లాలో మృతి చెందిన 33 వేల 478 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించే అంశంపై సమగ్ర విచారణ చేయాలన్నారు. వేమూరు, రేపల్లె నియోజకవర్గాలలోని తహశీల్దార్ల పనితీరు సరిగా లేదని కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికలకు సంబంధించి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యోగాలు పోతాయని హెచ్చరించారు. భూముల రీసర్వేలో హద్దురాళ్లు వేసే ప్రక్రియ ఆశాజనకంగా లేదని జిల్లా సంయుక్త కలెక్టరు కె శ్రీనివాసులు తెలిపారు. ఇప్పటివరకు 277 గ్రామాలలో డ్రోన్ ద్వారా భూముల చిత్రీకరణ సాగుతోందని అన్నారు. 82 గ్రామాలలో డ్రోన్ ప్రక్రియ ముగిసిందని ఆయన వివరించారు. భూహక్కు పత్రాలు 829 సిద్ధం కాగా, కేవలం 323 మందికే ఇకెవైసి పూర్తి చేయడంపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పత్రాల జారీలో నిర్లక్ష్యం వీడాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ సత్వరమే చేపట్టాలన్నారు. విద్యా దీవెన కింద అర్హులైన విద్యార్థులకు ఓటు హక్కు కల్పించాలని ఆయన ఆదేశించారు. పంట కోత ముగుస్తున్నందున గ్రామాలలో నీటిపన్నుల వసూళ్లపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె లక్ష్మీ శివజ్యోతి, ఆర్‌డిఓలు కె రవీందర్, పి సరోజిని, పార్థసారధి, తహశీల్దార్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పొన్నలూరు

జగనన్న కాలనీ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ దినేషన్ కుమార్ తెలిపారు. జగనన్న కాలనీ లేఅవుట్‌ను శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులు వెంటనే గృహాలు నిర్మించుకోవాలన్నారు. ఈనెల ఆఖరు నాటికి పునాధులు నిర్మిచపోతే వారి పట్టాలను రద్దు చేసి కొత్త వారికి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం పొన్నలూరు రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ శ్లాబ్ పెచ్చులూడుతున్న విషయాన్ని పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి అంచనాలు



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

తయారు చేసి నివేదికలు పంపాలని పంచాయతీరాజ్ ఎఇకి సూచించారు. అనంతరం ప్రభుత్వం జూనియర్ కళాశాల తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాలలో ప్రహరీ నిర్మాణానికి నాడు-నేడు పథకం ద్వారా రూ.83లక్షలు మంజూరైనట్లు తెలిపారు. తొలుత కళాశాల ప్రిన్సిపల్, కళాశాల సిబ్బంది కలెక్టర్ దినేష్‌కుమార్‌ను పుష్పగుచ్ఛంతో ఆహ్వానించారు. అంగన్‌వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శైలేంద్రకుమార్, ఎంపిడిఒ రత్నజ్యోతి, హౌసింగ్ పీడీ పేరయ్య, హౌసింగ్ ఎఇ సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజల్లో సేవా భావం పెంపొందించాలి

జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-మార్కాపురం

సమాజంలో అందరూ బాగుం డాలని, ఎవరి శక్తిమేర వారు ఇతరులకు సహాయం చేసేలా ప్రజల్లో సేవా భావాన్ని అలవర్చాలని జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు.



మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

స్థానిక వెలుగు కార్యాలయ ప్రాంగణంలో ఆల్ఫా గ్లోబల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ తామెల్లప్పుడూ పేదలకు తగిన మేర సాయం చేస్తుంటామని చెప్పారు. బూచేపల్లి సుబ్బారెడ్డి ఆశయాలు కూడా సాయం అందించడమేనని తెలిపారు. ప్రతి ఏడాది తాము పాస్టర్లకు దర్శిలో, చీమకుర్తిలో తగిన మేర సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 19న ఆర్‌టిసి బస్టాండు ఎదురుగా ఉన్న తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి ఆవరణలో మార్కాపురం నియోజకవర్గ స్థాయిలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాస్, జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, వైసిపి తర్లుపాడు మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు దారివేముల హర్షిత బాబి, 11వ వార్డు ఇన్‌ఛార్జి ఎం. ఉత్తమ్‌కుమార్, వైసిపి నాయకులు బూదాల సతీష్, రోజ్‌లిడియా, విశ్రాంత తహశీల్దారు జి.జయపాల్, నిర్వాహకులు డాక్టర్ ఎస్. విజయభాస్కర్‌రావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- మద్దిపాడు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుధాకర్ బాబు తెలిపారు. మండల పరిధిలోని నేలటూరు పంచాయతీ పరిధిలోని నేలటూరువారి పాలెంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మహా లక్ష్మమ్మ, నాయకులు కోటిరెడ్డి, సంజీవరావు, కష్ణారెడ్డి , హౌసింగ్ డిఇ శ్రీనివాస ప్రసాద్, ఎఇ హేమలత, ఎపిఎఒ బి. నరేంద్ర కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గ్రామీణ మహేంద్ర రెడ్డి, పంచాయతీ ఎఇ సునీల్ కుమార్ పాల్గొన్నారు **పొదిలి :** అర్హులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. మండల



కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పరిధిలోని సలకనూతల గ్రామంలోని దొండ్లేరు హరిజనపాలెం, ఎస్‌సికాలనీ, బిసి కాలనీలలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు విరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీకష్ణ, ఇఒఆర్‌డి రాజశేఖర్, ఆర్‌ఐ కిలారి సుబ్బారావు, వైసిపి మండల కన్వీనర్ దుగ్గంపూడి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు వినోద్ కుమార్, గ్రామ నాయకులు తిరుపతి స్వామి సాంసన్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపిపి కారును అడ్డుకున్న ఎస్ఐ

- ఎస్ఐ, ఎంపిపి మధ్య వాగ్వాదం
- ఎంపిడిఒ కార్యాలయం ఉద్రిక్తత
- ఎస్ఐపై ఎస్‌పికి ఫిర్యాదు
- సిఐ జ్యోకంతో సద్దుమణిగిన సమస్య

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొనేందుకు ఎంపిపి నలమలపు అంజమ్మ, జడ్‌పిటిసి యాదల రత్నభారతి, మహిళా ఎంపిటిసిలు కారులో వచ్చారు. అయితే ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి కారుకు పర్మిషన్ లేదంటూ గేటుబైట నిలుపుదల చేశారు. తాము ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిసిలమని చెప్పారు. మీరు ఎవరైతే నాకేంటి అంటూ ఎస్ఐ దురుసుగా మాట్లాడారు. కారు ప్రక్కన ఆపాలని హుకుం జారీ చేశారు. తనకు ఫోన్ వస్తేనే కారును లోనికి అనుమతిస్తామని తెలిపారు. ఎవరి దగ్గర నుంచి ఫోనురావాలని ఎంపిపి అంజమ్మ ప్రశ్నించారు. దీంతో ఎస్ఐ తొలుత ఎమ్మెల్యే అని, తర్వాత ఎంపిడిఒ అని చెప్పాడు. సమావేశం తన అధ్యక్షతన జరగాల్సి ఉందని, ఎమ్మెల్యే కారును ఎందుకు లోనికి రానీయొద్దని చెపుతారని ఆమె ప్రశ్నించారు. దీంతో ఎంపిపి, ఎస్ఐ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరం నెలకొంది. ఈ విషయం గురించి సమాచారం తెలుసుకున్న సిఐ



వాగ్వాదం ఆడుకుంటున్న ఎస్ఐ, ఎంపిపి

రాంబాబు ఎస్ఐకు ఫోను చేయడంతో సమస్య సద్దుమణిగింది. అనంతరం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత శాఖల వారిగా సమీక్ష నిర్వహించారు అనంతరం ఎంపిపి అంజమ్మ మాట్లాడుతూ ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు అందరితో సమన్వయంగా వ్యవహరిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాల్సి ఉందన్నారు. అయితే అందుకు భిన్నంగా తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అభివద్ధికి నిరోదకుడుగా వ్యవ హరిస్తున్నారని విమర్శించారు. కార్యాయలంలో పనిచేస్తే ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అదే సమయంలో ఎండిపిఒ సమావేశం నుంచి వెళ్లి పోయారు. సమావేశం మధ్యలో ఎంపిడిఒ వెళ్ళడం మంచి పద్ధతి కాదన్నారు. గ్రామాల్లో పనులు ఒకరుచేస్తే మరోకరికి తీర్మాణాలు ఇవ్వడం ఏమిటని ఆమె ప్రశ్నించారు.

ఎంపిడిఒపై ఎంపిటిసిలు,సర్పంచుల ధ్వజం

ప్రజలచేత ఎన్నుకోబడిన ఎంపిటిసిలు,సర్పంచులు అభివద్ధి పనులు కేటాయించ కుండా ఎంపిడిఒ శ్రీనివాసరావు తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పలు ఎంపిటిసిలు, సర్పంచులు ధ్వజమెత్తారు. చేకూరపాడు సర్పంచి రమేష్ బాబు మాట్లాడుతూ ఎంపిడిఒ సర్పంచులకు కనీస మర్యాద కూడ ఇవ్వకుండా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఉన్నంత కాలం తాను మండల సర్వసభ్య సమావేశానికి వచ్చేది లేదని సమావేశాన్ని వాకౌట్ చేసి వెళ్ళిపోయారు. ఎస్ఐ తీరుపట్ల ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు ఎస్‌పి మల్లిక గర్గ్‌కు ఫిర్యాదు చేశారు. జడ్‌పిటిసి రత్నభారతి తన అవమానం జరిగిందని సమావేశానికి రాకుండా వెళ్ళి పోయారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి అంజుల, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీలో అవినీతిపై విచారణ

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

మండల పరిధిలోని అమ్మనబ్రోలు పంచాయతీలో చోటు చేసుకున్న అవినీతిపై సిపిఎం జిల్లానాయకుడు జె.జయంతిబాబు సమాచారహక్కు చట్టం ద్వారా సమాచారాన్ని సేకరించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గత నెల 26న డిఎల్‌పిఒ పద్మావతి విచారణ జరిపారు. రూ. 20 లక్షల మేర అవినీతి జరిగినట్లుగా విచారణలో తేలింది. ఆ సయంలో ఎంబుక్‌లను విచారణ పూర్తికాలేదు. దీంతో మళ్లీ శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ విషయంలో పలు విషయాలు వెలుగు చూస్తున్నాయి. విచారణ పూర్తి అయితేకాని ఎంత మొత్తంలో అవినీతి జరిగిందో తెలుస్తుంది.

నేడు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ 2022 -23 వెయిట్ లిఫ్టింగ్ , పవర్ లిఫ్టింగ్ అండర్-14 , అండర్ -17, అండర్ -19 బాల బాలికల ఎంపిక ఒంగోలులోని భారత జాతీయ వ్యాయామ కళాశాలలో శనివారం నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ సిహెచ్.సుబ్బారావు తెలిపారు. ఈ ఎంపికలకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్, మూడు కలర్ పాస్ ఫొటోలు, అప్లికేషను ఫారం తమ వెంట తీసుకొని రావాలన్నారు.

విద్యార్థులకు అభినందనలు

పెద్దదోర్నాల : పెద్ద దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుచున్న అభిషేక్ , హర్షద్ అండర్ - 17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి త్రో బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రాతినిథ్యం వహించి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిజశ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్లు పి.రామా నాయక్, సుబ్రహ్మణం తెలిపారు. ఈ నెల 17 నుంచి 19 వరకు వైఎస్‌ఆర్ కడప జిల్లాలోని కమలాపురంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో వారు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు షేక్ అబ్దుల్ సలాం, యోగా మాస్టర్ ఎ. మహేష్ రెడ్డి , ఆయుబ్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్స్ రద్దు దారుణం

ఒంగోలు కలెక్టరేట్ : లక్షలాది మంది పేద విద్యార్థులకు ఏళ్ల తరబడి అందజేస్తున్న ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరి దారుణమని ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్సులు షేక్ యాసిన్ బాషా, మొఘల్ షంషీర్ బేగ్ తెలియజేశారు. ఇకపై 1 నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించడం దారుణమని, వెంటనే పున్ణపరిశీలించాలని వారు డిమాండ్ చేశారు. మానవీయ విలువల ప్రాతిపదికన ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తక్షణమే పున: పరిశీలించి స్కాలర్ షిప్‌ను పునరుద్ధరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఆమోదించాలని వారు డిమాండ్ చేశారు.



తీరంలో పర్యటిస్తున్న అధికారులు

తీరంలో అధికారుల పర్యటన

కొత్తపట్నం : తుపాన్ నేపథ్యంలో ప్రత్యేక బృందం కొత్తపట్నం సముద్ర తీరాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సుజాత మాట్లాడుతూ సముద్రంలో అలలు తీవ్రతగా ఉన్నాయని, మత్స్యకారులను వేటకు వెళ్లవద్దని సూచించారు. పడవలు, వలలను ఒడ్డుకు చేర్పించారు. మధ్యాహ్నం సమయం నుంచి జల్లులతో కూడిని వర్షం పడుతోంది. ఈ కార్యక్రమంలో మెరైన్ సిఐ, సిబ్బంది, తహశీల్దారు రమణారావు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్‌లో రాళ్లు..

- రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు అగ్నిమాపక కేంద్రం వద్ద నుంచి ఒంగోలు వెళ్లే ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారిలో రోడ్డు మార్జిన్ కొందరు రాళ్లు కొట్టి కంకర తయారు చేసి లక్షలు గడిస్తున్నారు. రాళ్లు కొట్టే సమయంలో ఇటీవల పెచ్చికలు ఎగిరిపడి పలువురు వాహనదారులకు గాయపడ్డారు. ఒంగోలు నుంచి టంగుటూరులోకి వచ్చేందుకు ఇదే ప్రధాన రహదారి. దీంతో ఈ రహదారిలో నిత్యం వందలాది బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఒంగోలు నుంచి టంగుటూరు వచ్చే వాహనదారులు అగ్నిమాప కేంద్రం


మార్జిన్‌లో వేసిన రాళ్లు

పక్కనే ఉన్న అండర్ రైల్వే బైపాస్ మీదుగా గ్రామంలోకి వెళ్లాల్సి ఉంది. రైల్వే అండర్ బ్రిడ్జికి వెళ్లే రహదారి ప్రారంభంలోనే టన్నుల కొద్దీ రాళ్లను అక్కడ నిల్వ చేశారు. దీంతో అక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఆర్‌అండ్‌బి రోడ్డు మార్జిన్ పెద్ద పెద్దరాళ్లు వేసి కూలీల చేత కొట్టించి కంకర తయారు చేసి ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారిపైనే ట్రాక్టర్లకు లోడ్ చేసి క్రయవిక్రయాలు జరుపుతున్నారు.దీంతో రైల్వే అండర్ బైపాస్ నుంచి వాహనాలు ట్రంకు రోడ్డుపైకి వచ్చే సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. పలువురు అధికారులు ఈ రహదారి పైనుంచే జిల్లా కేంద్రమైన ఒంగోలుకు వెళ్లాల్సి ఉంది. అధికారులు రాళ్లు కొట్టిస్తున్న వారిని ఇదేమిటని ప్రశ్నించిన దాఖలాలు లేవు. దీంతోపాటు రాళ్లు కొట్టే సమయంలో దుమ్ము, ధూళి కూడా అధికంగా సంఖ్యలో వస్తూ పర్యావరణ సమస్యలతోనూ ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. అయినప్పటికీ పంచాయతీ, ఆర్‌అండ్‌బి అధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజల విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రహదారి మార్జిన్ పక్కనే నిల్వ చేసిన రాళ్ల ఆక్రమణలను తొలగించి ప్రమాదాల నుంచి కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వడ్డెర్లను ఎస్‌టిల్లో చేర్చాలి

ప్రజాశక్తి-చీమకుర్తి

వడ్డెర్లను ఎస్‌టిల్లో చేర్చాలని వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు గుంజి నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమంతు రాయప్ప డిమాండ్ చేశారు. స్థానిక వడ్డెరపాలెంలో జాతీయ స్థాయిలో వడ్డెర సంఘం బత్తుల మల్లికార్జునరావు అధ్యక్షత శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు, హనుమంతు రాయప్ప కర్ణాటక, తమిళనాడు,ఒరిస్సా రాష్ట్రాలలో వడ్డెరలను ఎస్‌టిల్లో చేర్చినట్లు తెలిపారు. తెలంగాణా అసెంబ్లీలో తీర్మానం చేసి పంపారని తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ చల్లాఅంకులు మాట్లాడుతూ వడ్డెర్లు ఐక్యంగా ఉండి,ప్రభుత్వాల నుంచి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. అనంతరం వడ్డెర్ల ఆరాధ్య నాయకులు కందులాపురం తమ్మిశెట్టి వెంకటస్వామి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళు లలర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లెపు చెంచురామయ్య, మల్లికార్జునరావు,చల్లా రామ్మూర్తి, నాగభూషణం, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-పామూరు

స్థానిక శ్రీచైతన్య హై స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు మరియు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ కె.శ్రీనివాస రావు మాట్లాడుతూ వాహనదారులు వాహనాలను వేగంగా నడపరాదని తెలిపారు. బైకు నడిపే సమయంలో తప్పనిసరి హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్ క్రాసింగ్ సమయంలో సిగ్నల్స్ పాటించాలన్నారు. తొలుత విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జిలాని బాషా, డీన్ అశోక్, ఉపాధ్యాయులు కె.శ్రీనివాసులు, రఫీ, భారత్, పీడీ బ్రహ్మయ్య, కిషోర్, సల్మా, ప్రసన్న, మాధవి, వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వెలిగండ్ల

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఈనెల 10, 11 తేదీల్లో విశాఖ, అరకు ప్రాంతాలకు విజ్ఞాన, విహార యాత్రలకు వెళ్తున్నారు. అందులో భాగంగా జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి విద్యార్థులు విజ్ఞాన, విహార యాత్రలకు వెళ్లేందుకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతం విజయభాస్కర్‌రెడ్డి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఆకుల రవికుమార్, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు జడ్‌పిటిసికి అభినందనలు తెలిపారు.


మాట్లాడుతున్న పశుసంవర్థశాఖ జేడీ బేబీరాణి

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-జరుగుమల్లి

పశుసంవర్ధక శాఖ ద్వారా అందజేస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి తెలిపారు. జరుగుమల్లిలోని రైతు భరోసా కేంద్రం వద్ద మండల సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ గ్రామాల్లో పశుసంవర్ధక శాఖకు సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ద్వినియోగం చేసుకోవాలన్నారు. 75 శాతం సబ్సిడీపై రైతులకు జొన్న విత్తనాలు అందజేస్తున్నట్లుతెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు నయీామ్ అహమ్మద్, ఎఒ డి. యుగంధరరెడ్డి, పశు వైద్యాధికారి డాక్టర్ అరుణ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతులు, గ్రామ వ్యపసాయ సభ్యులు, ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.


'చెత్త' పాలనకు స్వస్తి చెప్పాలి : కందుల

ప్రజాశక్తి-మార్కాపురం

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చెత్త పాలన సాగిస్తున్నారని, దానికి స్వస్తి పలికేందుకు వచ్చే ఎన్నికలో టిడిపిని గెలిపించాలని టిడిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల నారాయణరెడ్డి ప్రజల కష్టాలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. టిడిపి కార్యక్రమాలకు ప్రజల నుంచి వస్తున్న స్పందన వైసిపి పాలనపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో తెలుసుకోవచ్చున్నారు. పెరిగిన ధరలతో సామాన్యులు అష్ట కష్టాలు పడుతున్నారన్నారు. రోజు కూలీ పనులు చేసుకునే వారికి కుటుంబాలు గడవడం లేదన్నారు. చివరకు చెత్త మీద కూడా పన్ను వేసిన చరిత్ర సిఎం జగన్‌దేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జునరావు, ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న కందుల నారాయణ రెడ్డి

గిద్దలూరు రూరల్ : మండల పరిధిలోని గడికోట పంచాయతీ పరిధిలోని పరమేశ్వరనగర్‌లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌టిల సంక్షేమానికి, అభివద్ధికి శ్రీకారం చుట్టిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కు తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ముచ్చుకుంట్ల రామసుబ్బయ్య, టిడిపి నాయకులు పాముల మునయ్య, బొమ్మినేని వెంకటేశ్వర్లు, ఆవుల రాజయ్య, శీలం జగన్మోహన్‌రెడ్డి, నరసింహులు, బీసీ నాయకులు బైలడుగు బాలయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

గ్రామస్థాయిలో వ్యవసాయ, రైతుల సమస్యలు పరిష్కరించేందుకు వ్యవసాయ సలహా మండలి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎఒ దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం ఎంపిపి పోరెడ్డి అరుణా చెంచిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అధికారులు రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, పంటలకు సంబంధించిన సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారి లీనా గ్రేస్ మాట్లాడుతూ పశువులకు అనారోగ్య సమస్యలు ఉంటే 1962 నెంబర్ కి కాల్ చేస్తే పశు సంచార వాహనం రైతుల ఇంటి ముంగిటకు వచ్చి చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ గోలమారి. శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి పోరెడ్డి అరుణచెంచిరెడ్డి

సంతనూతలపాడు రూరల్ : కౌలు రైతులందరూ సిసిఆర్‌సి కార్డులు తీసుకొని ప్రభుత్వ పథకాలను పొందాలని ఎఒ పావని తెలిపారు. సంతనూతలపాడు -1 రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ కౌలు రైతులందరూ జెఎల్ జి గ్రూపులుగా ఏర్పడి బ్యాంకు ద్వారా పంట రుణాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎఒ శైలజా రాణి , ఎఇఒ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శిద్దా వెంకటేశ్వరరావు

కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని కె.అగ్రహారం గ్రామంలోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సంధర్భంగా ఈనెల 16 నుంచి జనవరి 15 వరకు చేపట్టే వివిధ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ ధర్మకర్తలు, కృష్ణసాయి గ్రానైట్స్ అధినేత శిద్దా వెంకటేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ధనుర్మాసం సందర్భంగా నెల రోజులపాటు విశిష్ట కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్రం హరిప్రభాకరరావు, గుర్రందామోదరరావు,పి. శ్రీనివాసరావు, కె.సుబ్బారావు, రమణయ్య,శేషాచార్యులు పాల్గొన్నారు.


భారతి జన్మదిన వేడుకల్లో జడ్‌పిటిసి వెన్నా ఇందిర

వైఎస్ భారతి జన్మదిన వేడుకలు

మార్కాపురం : స్థానిక ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్. భారతి జన్మనది వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ వెన్నా హనుమారెడ్డి సతీమణి, తర్లుపాడు జడ్‌పిటిసి వెన్నా ఇందిర పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ వైఎస్.భారతి ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.గోపాలకష్ణ,విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ లేఅవుట్ల పరిశీలన

జరుగుమల్లి : జగనన్న కాలనీ లేఅవుట్లలో గృహ నిర్మాణాలు వారంలోపు ప్రారంభించాలని ఎంపిడిఒ పి.రామకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని వర్ధినేనివారిపాలెం, కొత్తపాలెం గ్రామాలలోని జగనన్న లేఅవుట్లను మండల ప్రత్యేక అధికారి, దేవాదాయ శాఖ కమిషనర్ గ్రంధి మాధవి, ఎంపిడిఒ రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వార జగనన్న కాలనీ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ అవినాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్, కొత్తపాలెం సర్పంచి మాల్యాద్రి పాల్గొన్నారు.

తుపాను ప్రభావంతో జోరువాన

ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

బంగాళా ఖాతంలో ఏర్పడ్డ మాండూస్ తుపాను ప్రభావంతో శుక్రవారం మధ్యాహ్నం వరకు ఒక్కటొక్కటిగా రాలుతున్న చినుకులు సాయంత్రానికి క్రమంగా పెరిగి ఓ మోస్తరు వర్షంగా మారింది. దీంతో కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు నేల వాలుతుండగా ఇప్పటికే కోతలు కోసిన పొలంలో ఓదెలు వర్షానికి తడిసి ముద్దగా మారాయి. దీంతో అన్నదాతల్లో ఆందోళన మొదలయ్యింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో ప్రకృతి తన ప్రతాపం చూపిస్తుండటంతో ఎంతమేర నష్టాలను చవి చూడాల్సి వస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు. మండలంలో సుమారు 15 వేల ఎకరాలలో వరి పంట సాగుచేయగా ఇప్పటివరకు 50 శాతం కూడా కోతలు పూర్తి కాలేదు. దీనిలో అధిక శాతం ఓదెల దశలోనే ఉన్నాయి. పనలు తడిస్తే ధాన్యం రంగుమారి నాణ్యతను కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కోతకు సిద్ధంగా ఉన్న పైరు నేల వాలుతుందని, దీని కారణంగా కూలిరేట్లు పెరగటం, ఎక్కువ రోజులు నీరు నిల్వవుంటే గింజలు మొలకెత్తే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా కోతల సమయంలో కురిసే వర్షానికి తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే అధిక శాతం మంది రైతులు నష్టాలను చవిచూడాల్సిన దుస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భట్టిప్రోలులో వర్షానికి నేల వాలిన వరి పైరు



చెరుకుపల్లిలో తడిసిన వరి పనలు

చెరుకుపల్లి: మాండూస్ తుఫాను ప్రభావం వలన మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు కురిశాయి. మండలంలో మొత్తం ఖరీఫ్ సీజన్లో 7,560 హెక్టార్లలో వరి సాగు చేయగా సగానికి పైగా కోతలు ప్రారంభం కాకపోగా, 40 శాతం కోతలు పూర్తయ్యాయి. వీటిలో సగం కుప్పలు వేయగా 20 శాతం కోతలు కోసి పొలంలో ఉన్నాయి. గత కొంతకాలంగా భారీ వర్షాలు పడతాయని అధికారులు జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో రైతులు కోసిన పొలాల్లో ఎక్కువ శాతం హడావిడిగా కుప్పలు వేశారు. మిగిలిన కొంత భాగం ఆరుదల కాకపోవడంతో పాటు కుప్పలు వేయడానికి కూలీలు దొరక్క వరికుప్పలు వేయలేకపోయారు. దీంతో వర్షాలు మరింత పెరిగితే మొలకలు వస్తాయేమోని రైతులు ఆందోళన చేస్తున్నారు. శుక్రవారం రాత్రి వరకు వాతావరణం కొంతమేర అనుకూలించినప్పటికీ వర్షాలు పెరుగుతాయేమోనని రైతులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కోసిన పంటను వెంటనే కుప్పలు వేయాలని, కుప్పలు వేయలేని పొలాల్లో ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. కుప్పలు వేసే సమయంలో ఎకరానికి 200 కేజీల ఉప్పును జల్లి కుప్పలు వేయాలని సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలలో వర్షం వలన తడిసినట్లయితే వెన్ను మీద మొక్క మొలిచే అవకాశం ఉందని, దీని నివారణకు వెన్నులు తడిచే విధంగా 50 గ్రాములు ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని తెలిపారు.

సత్వరమే పూడిక పనులు చేపట్టాలి

పలుచోట్ల వ్యవసాయ సలహా మండలి సమావేశాలు

ప్రజాశక్తి- వేటపాలెం

గుర్రపు డెక్క, పంట కాలువల పూడికతీత పనులను సత్వరమే చేపట్టాలని మండల వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామన్నపేట రైతుభరోసా-1లో మండల వ్యవసాయ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటకాలువల్లోని నాచు పూడికతీత పనుల గురించి ఇరిగేషన్ శాఖ అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా సచివాలయాల స్థాయిలో జరిగిన సమావేశాల్లో కమిటీల దృష్టికి వచ్చిన సమస్యలపై చర్చించారు. రాజుబంగారు పాలెం ఆయకట్టు మేటలను తొలగించాలన్నారు. సేంద్రియ వ్యవసాయంతో భూసారాన్ని పెంపొందించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఐ కాశీవిశ్వనాథం, ఇరిగేషన్ ఏఇ పవన్‌కుమార్, ఏపిసిఎన్ఎఫ్ భారతి పాల్గొన్నారు.

అద్దంకి: రైతు భరోసా కేంద్రాలలో రైతులకు కావలసిన అన్ని రకాల కంపెనీ విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని ఏపీ సీడ్స్ మేనేజర్ జి సుబ్బయ్య తెలిపారు. శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ రబీ ఈ పంట నమోదు రెండు రోజులలో మొదలు కానుందని, సాగు చేసిన ప్రతి పంట ఈ పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. పిఎం కిసాన్ ఈకెవైసి చేయించుకోని వారు వెంటనే చేయించుకోవాలని, లేనిచో నగదు జమ కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.



వేటపాలెంలో సమస్యల గురించి చర్చిస్తున్న బోర్డు సభ్యులు

నగరం: మండలంలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. దీనిలో వ్యవసాయ అధికారి వి రమేష్‌బాబు మాట్లాడుతూ మండూస్ తుపాను పొంచి వుందని, రైతులు వరి కోత దశలో ఉన్నందున అప్రమత్తంగా వుండాలని పేర్కొన్నారు. వరి పంటకు పనలు మీద వున్నవారు తడిసినచో 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేసుకోవాలన్నారు.

పనల మీద 100 లీటర్ల నీటికి 5 కేజీల కల్లు ఉప్పు పిచికారీ చేసుకోవాలని పేర్కొన్నారు. కుప్పలు వేసే సమయంలో తడిస్తే కుప్పలో 1 ఎకరా కుప్పకు 10 కేజీల కల్లు ఉప్పు వేసుకోవాలని తెలిపారు. దీనివలన ధాన్యం మొలక రాకుండా వుంటుందని అన్నారు. ధాన్యం అమ్ముకోదలచినవారు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించి ప్రభుత్వం వారు ఇచ్చే మద్దతు ధరకు అమ్ముకోవాలని పేర్కొన్నారు. పిఎం కిసాన్ ఈకెవైసి ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని, లేకుంటే 13వ విడత డబ్బులు జమ కావని అన్నారు. పురుగు మందులు, ఎరువులు పిచికారీ చేసుకోవడానికి డ్రోన్స్ సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందిస్తున్నారని, కావలసిన వారు వివరాలకు రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి వి రమేష్ బాబు అన్నారు.

భట్టిప్రోలు: ఈ ఏడాదికి రబీ సీజన్లో రైతులు సాగుచేసే వివిధ రకాల పంటలను వ్యవసాయ సిబ్బంది నూరుశాతం ఈ క్రాప్ నమోదు చేయాలని ఎంపిపి డివి లలితకుమారి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సిబ్బంది ఎప్పటికప్పుడు తగిన సలహాలు సూచనలు అందించాలని కోరారు. ఆర్‌బికెలలో అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్, జెడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి, సలహా కమిటీ అధ్యక్షులు కుందేటి రమేష్ నాయకులు బాలాజీ, మల్లేశ్వరరావు, విఏఏలు ఉన్నారు.

పర్చూరు: పర్చూరు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల గురించి చర్చించారు. మండల సలహా కమిటీ ఛైర్మన్ కోట హరిబాబు మాట్లాడుతూ గ్రామ స్థాయి రైతు భరోసా సిబ్బంది అందరూ రైతులకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మాజీ జెడ్పీటీసీ కొల్లా సుభాష్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు అందరికీ సరఫరా చేయాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ మేక ఆనందకుమారి, జడ్పీటిసి సభ్యులు గంగ భవాని, ఏడిఏ మోహన్‌రావు, మండల వ్యవసాయాధికారి ఎస్ రామమోహన్‌రెడ్డి, మండల స్థాయి సలహా కమిటీ సభ్యులు, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రానికి మంచి రోజులు: ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

వైసిపి పాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందని టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య అన్నారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన బాపట్ల జిల్లాలో జరిగిన నేపథ్యంలో సుమారు 200 మంది వయోవృద్ధులు ద్విచక్ర వాహనాలతో ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు. కొత్తపేటలోని టిడిపి కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో పర్యటించి బాపట్ల చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో విద్యార్థులు, వృద్ధులు, వితంతువులు, నిరుద్యోగులు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూన్నారు అన్నారు. ఓవైపు సంక్షేమ పథకాలు ఇస్తున్నానంటూ ఆర్భాటంగా ప్రచారం చేస్తూ మరోవైపు ఆంక్షల పేరుతో పథకాలను అందకుండా చేస్తూ ప్రజల జీవితాలతో ఆటలాడుతున్నారని అన్నారు. రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతోనే అది సాధ్యపడుతుందని రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ ఆలోచించి తమ ఓటు హక్కును వినియోగించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సహాయ సేవ సంస్థ నాయకులు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



వయోవృద్ధుల ర్యాలీలో పాల్గొన్న ఎంఎం కొండయ్య



తల్లీ బిడ్డల వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తల్లీ బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-రేపల్లె

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో 'అను' మై బేబీ హాస్పిటల్ విజయవాడ వారి ఆధ్వర్యంలో తల్లీ బిడ్డల ఆరోగ్య శిబిరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించారు. ఉదయం10 గంటలకు రేపల్లె అను మై బేబీ హాస్పిటల్‌కు చెందిన స్త్రీల వైద్య నిపుణులు మణి శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో అను హాస్పిటల్స్‌కు చెందిన స్త్రీల గర్భకోశవ్యాధుల ప్రత్యేక నిపుణులు డాక్టర్ మణి, పిల్లల వ్యాధుల నిపుణులు లక్ష్మీ ప్రసన్న ఈ శిబిరంలో పాల్గొని తల్లీ బిడ్డలకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మాట్లాడుతూ ఆవశ్యకతను బట్టి గర్భిణులకు, అవసరమైన వారికి రాయితీ ధరలపై టిఫా స్కానింగ్‌ను స్థానిక స్వాన్ హెల్త్ కేర్ సెంటర్ వారు నిర్వహిస్తారని తెలియజేశారు. అనంతరం శిబిరంలో ప్రత్యేకంగా స్థానిక సాయి సేవా సమితి వారు తల్లి బిడ్డలకు పళ్ళు బిస్కెట్లు ఫలాలు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్టిక్ బ్రాంచ్ సభ్యులు అడుసుమల్లి ప్రభాకర్‌రావు, సయ్యద్ కరిముల్లా, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఉష, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-సంతమాగులూరు

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసేందుకు గాను ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మండల స్థాయిలో ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం సాంబశివరావు తెలిపారు. 12వ తేదీ ప్రారంభమయ్యే శిక్షణ తరగతులు, మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో, మండల విద్యా వనరుల కార్యాలయంలో జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు ఎంపీటీసీలు, అధికారులు, సర్పంచులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.



ప్రణాళిక పుస్తకాన్ని అందిస్తున్న ఇఓఆర్‌డి సుధాకర్

పంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక శిక్షణ

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండల స్థాయి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణా కార్యక్రమం జరిగింది. ప్రజా ప్రణాళికా ఉద్యమం 2022లో భాగంగా మండల స్థాయిలో గ్రామ అభివృద్ధి ప్రణాళిక 2023-24పై శిక్షణ కార్యక్రమం జరిగింది. 13వ తేదీ వరకు 3 రోజులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లా అంజమ్మ, ఎంపిపి మేకా ఆనంద కుమారి, జడ్పీటిసి సభ్యులు కొల్లా గంగా భవాని, మాజీ జడ్పీటీసీ సభ్యులు కొల్లా సుభాష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి కొసన సత్యనారాయణ, ఇఓఆర్‌డి సుధాకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు

ఒంగోలులో సినీ హీరోయిన్స్

మెహరీన్, అనసూయ సందడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని కర్నూలురోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన స్వాతి షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సినీ హీరోయిన్స్ మెహరీన్, అనసూయ సందడి చేశారు. వీరిని చూసేందుకు యువకులు పోటీపడ్డారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనసూయ, మెహరీన్ మాట్లాడుతూ స్వాతి షాపింగ్ మాల్ ప్రారంభించటానికి ఒంగోలు రావటం చాలా సంతోషంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన వివిధ రకాల వస్త్రాలు, ప్రధానంగా కాంచీపురం పట్టు చీరలను అందుబాటు ధరలలో ఉంచారన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే, 3 జిల్లాల కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు, మేయర్ గంగాడ సుజాత, ఎస్‌పి మల్లికగర్గ్, మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర నాయకులు శిద్దా రాఘవరావు, స్వాతి షాపింగ్ మాల్ అధినేత యు.వెంకట రమణ, షాపింగ్ మాల్ ఎమ్‌డి సాత్విక్, సాకేత్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



షాపింగ్ మాల్‌లో మెహరీన్, అనసూయ

మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డేస్తా..

- సైకో పాలన వద్దు..
- అందరూ తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారు..
- టిడిపి అధినేత చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

'బాపట్ల ఎమ్మెల్యే కోనా అవినీతిని తేలుద్దాం.. మీరు పోరాటానికి సిద్ధమా.. మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డేస్తా.. సైకో పాలన వద్దు.. సైకిల్ పాలన రావాలి.. వేరే ఆలోచన చేయకండి... వర్మను గెలిపించడమే ధ్యేయంగా పనిచేయండి.. వర్మకు అండగా ఉంటా.. బాపట్ల నియోజకవర్గాన్ని అభివద్ధి చేసే బాధ్యత నాది.. తెలుగుదేశాన్ని గెలిపించే బాధ్యత మీది.. మళ్లీ వస్తా మీకండగా ఉంటా.. అన్ని విధాలుగా ఆదుకుంటా..' అని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. బాపట్లలోని అంబేద్కర్ సర్కిల్‌లో శుక్రవారం రాత్రి జరిగిన 'ఇదే కర్మ రాష్ట్రానికి' సభలో ఆయన మాట్లాడారు. దేశం పార్టీ కార్యకర్తలు పట్టుదల, దీక్షతో ఉన్నారని, ఇలాంటి ఉత్సాహం జీవితంలో ఎప్పుడూ చూడలేదని, నాకు నమ్మకం వచ్చిందని, అందరూ తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. నాసిరకం మద్యం బ్రాండ్లు వచ్చాయని, రాష్ట్రంలో అన్నీ జగన్ రెడ్డి బ్రాండ్లే అని, ఆడబిడ్డల మంగళసూత్రాలు తెంచే కార్యక్రమం జగన్ చేపట్టాడని ఆరోపించారు. అందుకే 'ఇదేం కర్మ రాష్ట్రానికి' అనే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రాష్ట్రంలో జగన్ పది రూపాయలు ఇచ్చి వంద రూపాయలు దోచేస్తున్నాడని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైసిపి బంగాళాఖాతంలో కలవడం ఖాయమన్నారు. దేశం ప్రభుత్వ హయాంలో ఇసుక ఉచితంగా ఇచ్చామని, ఇప్పుడు ఇసుక దొరక్క ఎవరూ ఇల్లు కట్టే సాహసం చేయటం లేదన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రబాబునాయుడు

జోరు వానను సైతం లెక్కచేయకుండా..

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు రాక కోసం బాపట్లలో జోరు వానను సైతం లెక్కచేయకుండా కార్యకర్తలు ఎదురుచూశారు. పార్టీ బాపట్ల ఇన్చార్జి వేగేశన నరేంద్ర వర్మ నేతత్వంలో చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు భారీగా జన సమీకరణ చేపట్టారు. బాపట్ల పట్టణం మరియు బాపట్ల మండలం, కర్లపాలెం మండలం, పిట్టలవానిపాలెం మండలాల నుండి పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. సభలో బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఏలూరి సాంబశివరావు, బాపట్ల ఇన్‌ఛార్జి నరేంద్ర వర్మ, చీరాల ఇన్‌ఛార్జి యమ్‌యమ్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆ కార్యదర్శులను సస్పెండ్ చేయండి..

కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆదేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వేమూరు, కర్లపాలెం గ్రామ కార్యదర్శులను సస్పెండ్ చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను ప్రారంభించకపోతే బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణపై నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎమ్.పి.డి.ఓ.లు, ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వై.ఎస్.ఆర్. హెల్త్ క్లినిక్ లు, డిజిటల్ లైబ్రరీలకు నిధులు మంజూరైనప్పటికి నిర్మాణాలు మొదలు పెట్టకపోవడంపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. గ్రామాలకు శాశ్వత సంపదగా ప్రభుత్వ భవనాలను మంజూరుచేస్తే ఇప్పటివరకు నిర్మాణాలను ఎందుకు ప్రారంభించలేదని అధికారులను నిలదీశారు. అభివద్ధి పనులకు పుష్కలంగా నిధులున్నప్పటికి నిర్మాణ పనులు చేయకుండా అధికారులు నిద్రిస్తున్నారా.? అంటూ మండిపడ్డారు. వారం రోజుల్లో నిర్మాణ పనులలో పురోగతి లేని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని జె.సి.ని ఆదేశించారు. సమావేశంలో జేసీ కె శ్రీనివాసులు, డి.ఆర్.ఓ. లక్ష్మీశివజ్యోతి, ప్రకాశం జడ్.పి. సి.ఇ.ఓ. బి. జాలిరెడ్డి పాల్గొన్నారు.

పుట్టినరోజును

వచ్చే ఏడాది నుంచి జరుపుకుంటా..

- మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించి షష్టిపూర్తి కానుకగా ఇవ్వాలి
- కార్పొరేటర్లను కోరిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- బాలినేని వ్యాఖ్యలు ముందస్తు ఎన్నికలకు సూచనగా ఉన్నాయని చర్చ..

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ముందస్తు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ గంగాడ సుజాత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు పాల్గొని కేక్ కత్తిరించారు. వైసిపి కార్పొరేటర్లు, మహిళా కార్పొరేటర్ల భర్తలు పాల్గొని పూలమాలలు, దుశ్శాలువాలతో బాలినేని దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తాను పుట్టిన రోజు కార్యక్రమాన్ని జరుపుకోవడం లేదన్నారు. తన పుట్టినరోజు నాడే తన తల్లి చనిపోయినందున పుట్టినరోజు జరుపుకోవడం లేదని గుర్తు చేశారు. రాబోయే పుట్టిన రోజు నాటికి తనకు 60 ఏళ్లు వస్తాయని, అప్పుడు ఘనంగా పుట్టిన రోజు జరుపుకుంటానని తెలిపారు. తనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించి 60వ పుట్టిన రోజు కానుక ఇవ్వాలని కార్పొరేటర్లను కోరారు.



కేక్ కట్‌చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు

కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఇంజినీర్ కె మల్యాద్రి, ఎసిపి కె వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ వీరాంజనేయులు, శానిటరి సూపర్‌వైజర్ ఎన్ పిచ్చయ్య, రెవిన్యూ అధికారి మధుసూదన్, సీనియర్ కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్ బాబు(చిన్నారి), చింతపల్లి గోపిచంద్, యనమల నాగరాజు పాల్గొన్నారు.

చర్చనీయాంశమైన బాలినేని వ్యాఖ్యలు..

కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన బాలినేని శ్రీనివాసరెడ్డి ముందస్తు వేడుకల్లో బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఈ నెల 12న ఆయన పుట్టినరోజు. శుక్రవారం ముందస్తు పుట్టిన రోజు పేరుతో కార్పొరేషన్ కార్యాలయంలో కేక్ కత్తిరించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి బాలినేని శ్రీనివాసరెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తనను మరళా గెలిపించి తనకు 60వ పుట్టిన రోజు (షష్టిపూర్తి) కానుక ఇవ్వాలని ఆయన కార్పొరేటర్లను కోరారు. 2024లోనే అసెంబ్లీ సాధారణ ఎన్నికలు జరుగుతాయని అందరూ అంటున్నా ముందస్తు ఎన్నికలు రావచ్చనే ప్రచారం ఇటీవల జోరుగా జరుగుతోంది. ఈ క్రమంలో వచ్చే ఏడాది డిసెంబర్‌లో జరిగే తన పుట్టినరోజు నాటికి తిరిగి తనను ఎమ్మెల్యేగా గెలిపించి షష్టిపూర్తి కానుక ఇవ్వాలని బాలినేని శ్రీనివాసరెడ్డి స్వయంగా మైకు తీసుకొని కోరడంతో ముందస్తు ఎన్నికల ప్రచారం మీద మరలా చర్చ జరగడం విశేషం.

డిప్యూటీ మేయర్ ఛాంబర్ ప్రారంభం..

కార్పొరేషన్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జి ఛాంబర్‌ను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభించారు.

34లో గడపగడపకూ..

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం 34వ డివిజన్‌లో జరిగింది. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాన్ని

సమర్ధవంతంగా నిర్వహించాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గ్రామాలలో జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.విజయకష్ణన్ చెప్పారు. ఎమ్.పి.డి.ఓ.లు, ఇ.ఓ.పి.ఆర్.డి.లతో శుక్రవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. గ్రామాలలో వీధి విద్యుత్ దీపాల సర్వే పక్కాగా చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలు అంధకారంలో ఉండరాదన్నారు. ఏ ప్రాంతాలలో వీధి దీపాలు లేకుండా ఉన్నాయో వాటిని సర్వేలో గుర్తించాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా, సుందరీకరణతో అభివద్ధి చేయాలన్నారు. చెత్త సంపద కేంద్రాల నిర్మాణం, నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. క్లాప్ మిత్రలకు వేతనాలు సకాలంలో ఇవ్వాలన్నారు. ప్రతినెల చెల్లింపులు జరిగేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు ప్రయోజనం కల్పించే మంచి సేవలు అందించేలా చూడాలన్నారు. స్వామిత్వ సర్వే పక్కాగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం ప్రాధాన్యతను గుర్తించి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పంచాయతీల ఆర్థిక వనరుల అభివద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించుకొని పనిచేయాలన్నారు. పంచాయతీలలో అనధికార లేఅవుట్లకు చట్టబద్ధత కల్పించే అంశంపై అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె శ్రీనివాసులు చెప్పారు.గ్రామాలలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో డి.పి.ఓ. వై. శంకరనాయక్ పాల్గొన్నారు.

అర్హుల ఇంటి వద్దకే పథకాలు: అన్నా

ప్రజాశక్తి-గిద్దలూరు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను అర్హుల ఇంటి ముంగిటకే అందజేస్తున్నామని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. గురువారం నగర పంచాయతీ-3 సచివాలయం పరిధిలోని పలు వీధుల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడారు. అనంతరం ఆయా వీధుల్లో స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, కౌన్సిలర్ పరుచూరి సుభాషిణి, వైసీపీ నాయకులు పరుచూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా